సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



తల్లీ, శిశువు డాడీ హోంకు తరలింపు

నా అన్నవారు ఎవరూ లేకపోవడంతో బాలింతతో పాటు శిశువును ఐసీడీఎస్ అధికారులు డాడీ హోంకు తరలించారు. -8లో..



రాజస్థాన్ రాజుసం

డెఫ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు కడప కుర్రాడు బిల్లా రాజు ఎంపికయ్యాడు. -8లో..



గండికోటలో ఒబెరాయ్ కన్సల్టెన్సీ బృందం

గండికోటలో ఒబెరాయ్ కన్సల్టెన్సీ అధికారులు పర్యటించారు. ఆర్డీఓ శ్రీనివాసులు వారికి భూములను చూపించారు. -8లో..

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సహర్ శుక్ర (ఉ॥)
కడప	6.31	4.47
ప్రొద్దుటూరు	6.30	4.50
పులివెందుల	6.34	4.52

మహిళల ప్రగతికి ఈబీసీ నేస్తం

- జేసీ సాయికాంత్‌వర్మ
- జిల్లా వ్యాప్తంగా 33,087 మందికి రూ. 49.63 కోట్లు విడుదల
- లబ్ధిదారుల ఖాతాల్లో బటన్‌నొక్కి జమ చేసిన ముఖ్యమంత్రి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ సాయికాంత్‌వర్మ, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సగర, ఉప్పర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీ లక్ష్మి తదితరులు

కడప సిటీ : ఈబీసీ నేస్తం మహిళల ప్రగతికి నేస్తంగా ఉందని జాయింట్ కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈబీసీ నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ. 15 వేలు చొప్పున రెండవ విడత సాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జేసీ సాయికాంత్‌వర్మతోపాటు రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ గజ్జెల వెంకట లక్ష్మి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్ పర్సన్ జి.రమణమ్మ, రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి హాజరయ్యారు.

జిల్లాలో రూ. 49.63 కోట్లు

జిల్లా వ్యాప్తంగా ఈబీసీ నేస్తం పథకానికి 33,087 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున రెండవ విడత సాయాన్ని రూ. 49.63 కోట్లు విడుదలైంది. ఈ పథకం ద్వారా అగ్రవర్ణాల్లోని ఓసీ వర్గాలకు చెందిన రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, నాయుడు, సయ్యద్ తదితర మొత్తం 308 ఉప కులాల్లోని 40–60 ఏళ్లలోపు పేద మహిళలకు ప్రయోజనం చేకూరుతోంది.

మెగా చెక్కు అందజేత

ముఖ్యమంత్రి వీసీ అనంతరం స్థానిక వీసీ హాలులో ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి జేసీ సాయికాంత్‌వర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఈబీసీ నేస్తం సాయంతో జీవనోపాధితోపాటు వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క నిరుపేద మహిళ కూడా సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనేదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతోందన్నారు. లబ్ధి మొత్తాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని జేసీ సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే 1902 నెంబరుకు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు.

- ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ, మైనార్టీస్ కార్పొరేషన్ల ఈడీ బ్రహ్మయ్య, సంబంధిత సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈబీసీ మా బతుకు నేస్తం



ఈబీసీ నేస్తం పథకం మా కుటుంబానికి బతుకు నేస్తంగా మారింది. జగనన్న అమ్మ ఒడి, ఒంటరి మహిళ పెన్షన్ పథకాలతోపాటు రుణమాఫీ సాయాన్ని కూడా అందుకున్నాను. ఊహించని రీతిలో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉన్నాం.

– ఎం.గీతాంజలి, 16వ డివిజన్, సింగపూర్ టౌన్‌షిప్, కడప

ఆర్థికసాయంతో సామాజిక భద్రత



ముఖ్యమంత్రి ఆర్థికసాయంతోపాటు సామాజిక భద్రత కల్పిస్తున్నారు. ఈబీసీ నేస్తం పథకం సాయంతో సమాజంలో మంచి గుర్తింపు వచ్చింది. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలు మహిళల పాలిట వరంగా మారాయి. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, పెన్షన్, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా పథకాలు అందుతున్నాయి.

– పి.ఉమారాణి, 17వ డివిజన్, చెమ్ముమియాపేట, కడప

సీఎం నమ్మకాన్ని రెట్టింపు చేస్తాం



వితంతు పెన్షన్‌తోపాటు ఈబీసీ నేస్తం సాయం కూడా అందుతోంది. పేద వారికి సాయం అందించే మనసున్న నేత మా ముఖ్యమంత్రి. ఆర్థికంగా నిలదొక్కుకోగలమనే నమ్మకం మాలో రెట్టింపు అవుతోంది. మాపై ముఖ్యమంత్రి పెంచుకున్న నమ్మకాన్ని మరింత రెట్టింపు చేసి చూపిస్తాం. – ఎం.పద్మావతమ్మ, శాస్త్రినగర్, కడప

జగనన్నకు మహిళల ఆశీస్సులు ఉంటాయి



అగ్రవర్ణ మహిళల ఆర్థిక పరిస్థితులను కూడా గుర్తించి సాయం అందిస్తున్న జగనన్నకు ధన్యవాదాలు. ప్రభుత్వం అందించిన సాయాన్ని వ్యాపార పెట్టుబడిగా పెట్టుకుంటున్నా. ఈ పథకంతోపాటు పెన్షన్, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా కూడా వస్తోంది. మహిళా సాధికారత కోసం పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మహిళల ఆశీస్సులు ఎప్పటికీ ఉంటాయి.

– సి.రాజేశ్వరి, సీఎంఆర్ పల్లె, కడప

న్యూస్‌రీల్

22న గండిలో తలనీలాల టెండర్లు

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో సంవత్సర కాలం పాటు తలనీలాలు పొందేందుకు ఈనెల 22న సీల్డు టెండరు, బహిరంగ వేలం, ఈ–టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. టెండరులో పాల్గొనే వారు రు.20 లక్షలు ధరావత్తు కింద కార్యనిర్వహణాధికారి, శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం, గండిక్షేత్రం పేరున డీడీ తీయాలన్నారు. లేదా ధరావత్తును కార్యాలయంలో నగదు రూపంలో కూడా చెల్లించవచ్చన్నారు. సీల్డ్ టెండర్లను 22వతేది ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలోని టెండరు బాక్సులో వేయాలని సూచించారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

విదేశాలలో ఉద్యోగ అవకాశం

కడప ఎడ్యుకేషన్: ఐటీఐలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ వారు అంతర్జాతీయ కౌశల్ మహోత్సవం కార్యక్రమం ద్వారా ఉద్యోగాలను కల్పిస్తున్నట్లు వైఎస్సార్ జిల్లా ఐటీఐల కన్వీనర్, ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విదేశాలలో ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు నేరుగా తమ వివరాలను Kaushal mahotsav. nsdcdigital.org అనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. లేదంటే తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, పాస్ పోర్టు సైజు ఫోటో, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు (కలిగి ఉన్నవారు) తీసుకుని దగ్గరలో ఉన్న ఏ ప్రభుత్వ ఐటీఐను సందర్శించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉందని ఆయన చెప్పారు.

15న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 15 న జాబ్‌మేళా నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి తెలిపారు. అపోలో ఫార్మసీ కంపెనీలో ఫార్మసిస్టు ఉద్యోగానికిగాను ఈ జాబ్‌మేళా ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎంఫామ్, బి.ఫామ్, డి.ఫామ్ చదివి 19–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ.10–20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు ధృవపత్రాలు, ఫోటోలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వివరాలను ముందుగా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 89770 11128 నెంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

పుష్పగిరి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పుష్పగిరి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

వల్లూరు: ఈ నెల 18 వ తేదీ నుండి 27 వ తేదీ వరకు జరగనున్న పుష్పగిరి శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి , కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిలు బుధవారం ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, ఆలయ ప్రతినిధులు వెంకట సుబ్బారెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, చెన్న కేశవ రెడ్డి, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి తదితరులు వేంపల్లె మండలం వీరన్నగట్టుపల్లె గ్రామంలో జరుగుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అవినాష్‌రెడ్డిని కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ఆయన వారితో కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిచారు. కడపలోని కమలాపురం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిని కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ఆయన బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను వినియోగించుకోవాలి

చాపాడు: గ్రామీణ ప్రజల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లెలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరంను నాగరాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణాలకు వెళ్లలేని ప్రజల కోసం ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోనే ప్రతి పదిహేను రోజులకు ఒక సారి వైద్య శిబిరం నిర్వహిస్తోందన్నారు.

ఢీ అంటే ఢీ

- టీడీపీ ప్రాంతీయ సదస్సు నిర్వహణపై అంతర్గత విభేదాలు
- ఎయిర్‌పోర్టు పక్కన ఏర్పాటు చేయాలని ముందుగా సన్నాహాలు
- బిల్టప్ పక్కన తన స్థలంలోనే ఏర్పాటు చేయాలని భీష్మించుకున్న పుత్తా
- అనుమతులు లేకపోయినా ఏర్పాట్లలో నిమగ్నమైన వైనం
- లక్ష్మిరెడ్డి స్పీడ్‌ను నిలువరించాలనే అసలు కారణం
- వత్తాసుగా చేతులు కలిపిన కడప నేతలు

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు తీవ్రమయ్యాయి. ఒకరు సమ్మతిస్తే, ఇంకొకరు వ్యతిరేకిస్తున్నారు. ప్రత్యక్ష విరుద్ధభావాలతో వ్యవహరిస్తున్నారు. జోన్–5 టీడీపీ ప్రాంతీయ సదస్సు వేదిక ఏర్పాటు విషయంలో మరోమారు తెలుగుతమ్ముళ్ల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ముందుగా అధికారులు ఎయిర్‌పోర్టు సమీపంలో అశోక్‌లైల్యాండ్ షోరూమ్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసేందుకు సమ్మతించారు. హఠాత్తుగా బిల్టప్ పక్కన ఉన్న పుత్తా ఎస్టేట్‌లో నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా జిల్లా టీడీపీ నేతల సమ్మతి లేకపోయినా సరే ఇక్కడే ఏర్పాటు చేస్తామంటూ కమలాపురం టీడీపీ ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి భీష్మించుకున్న వైనమిది.

- తెలుగుదేశం పార్టీ జోన్–5 ప్రాంతీయ సదస్సు నిర్వహణ ఇదివరకూ మూడు పర్యాయాలు వాయిదా పడింది. ఈనెల 18న నిర్వహించేందుకు అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయించారు. కడప, అనంతపురం, హిందూపురం, నంద్యాల, కర్నూల్ జిల్లాల పరిధిలో 35 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాంతీయ సదస్సును కడపలో నిర్వహించనున్నారు. ఈ సదస్సును ముందుగా ఎయిర్‌పోర్టు సమీపంలో నిర్వహించాలని తలిచారు. ఆమేరకు అధికారులు సైతం సూచన ప్రాయంగా అంగీకరించారు. ఎన్‌హెచ్ రహదారికి 500 మీటర్ల దూరంలో సభ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్కడ ఏర్పాటుకు అనుమతులు కోరే లోపే బిల్టప్ సమీపంలో సన్నాహాలు చేస్తున్నారు. ఆమేరకు కడప టీడీపీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, వికాస్ హరికృష్ణ తదితరులు కొబ్బరి కాయలు కొట్టి ఏర్పాటు పనుల్లో నిమగ్నమయ్యారు.

లక్ష్మిరెడ్డి స్పీడ్‌కు బ్రేకులు వేసేందుకు...

కడప టీడీపీ టికెట్ కార్పోరేటర్ ఉమాదేవికి ఖరారయ్యింది. మా కోడల్ని ఆశీర్వదించాలని టీడీపీ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి గత కొంతకాలంగా ప్రచారం మొదలు పెట్టారు. లక్ష్మిరెడ్డి దూకుడు కట్టడి చేయాలని అంతే స్పీడుగా వైరిపక్షం పావులు కదుపుతోంది. ఇదివరకూ నారా లోకేష్ పర్యటన ఆలంఖాన్‌పల్లె మీదుగా కడపకు ఉండగా అనూహ్యంగా అడ్డగించి, రింగ్‌రోడ్డు వెంబడి దేవుని కడపలోకి ప్రవేశించేలా రూట్‌మ్యాప్ మార్చారు. ప్రాంతీయ సదస్సు ఎయిర్‌పోర్టు సమీపంలో ఏర్పాటు చేయాలని టీడీపీ నేతలు తలిచారు. ఆ భూమి ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డిది కావడంతోనే అక్కడ నిర్వహించరాదనే నిర్ణయానికి కొంతమంది టీడీపీ నేతలు తెరపైకి వచ్చారు. కమలాపురం ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి నాయకత్వంలో బిల్టప్ సమీపంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అధికారులు బిల్టప్ కంటే ఎయిర్‌పోర్టు స్థలమే అనువైన ప్రదేశంగా చెబుతున్నా అవేమీ పట్టించుకోలేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్టప్ సమీపంలో ఏర్పాట్లు ప్రారంభించారు. ఈమొత్తం వ్యవహారం కేవలం లక్ష్మిరెడ్డి స్పీడ్‌కు బ్రేకులు వేసే ఎత్తుగడలేనని పలువురు ఆ పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలతో నిమిత్తం లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తుండడం విశేషం.



బిల్టప్ వద్ద టెంకాయకొట్టి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

క్రికెట్ ఎంపికలకు 230మంది హాజరు

కడప స్పోర్ట్స్: కడప వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–19, సీనియర్ విభాగం క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి స్పందన లభించింది. ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్–19 క్రికెట్ ఎంతో కీలకమైనదన్నారు. ఎంపికల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ప్రాబబుల్స్‌కు ఎంపికచేస్తామని తెలిపారు. ప్రాబబుల్స్‌కు ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహించి తుదిజట్టును ప్రకటిస్తామని తెలిపారు. కాగా అండర్–19 విభాగంలో 130 మంది హాజరుకాగా వీరిలో ప్రతిభ కనబరిచిన 65 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపికచేశారు. సీనియర్స్ విభాగంలో 100 మంది క్రీడాకారులు హాజరుకాగా వీరిలో 50 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపికచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఏవైడీ సంయుక్త కార్యదర్శి సాయి పృథ్వీ తేజ్, సెలక్షన్ కమిటీ సభ్యులు అబ్దుల్ రెహమాన్ ఫరూఖ్, మునికుమార్‌రెడ్డి, నాగేంద్రస్వామి, విష్ణు మోహన్‌రావు, వై. శివప్రసాద్ పాల్గొన్నారు.

కల సాకారమైన వేళ...

- 98 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల్లో వెల్లివిరిసిన ఆనందం
- 172 మందికి 160 మంది హాజరు
- నియామక పత్రాలు అందజేత



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందచేస్తున్న నగర మేయర్ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: 1998 డీఎస్సీ అభ్యర్థుల ఏళ్ల నాటి కల నెరవేరింది. వారి కళ్లలో ఆనందం మెరిసింది. మా జీవితాల్లో వెలుగు నింపి మాకు, మా పిల్లల భవిష్యత్తుకు సీఎం బాటలు వేశారంటూ పొంగిపోయారు. జగనన్నకు జేజేలంటూ నినాదాలతో బుధవారం కడప డీఈఓ కార్యాలయ ఆవరణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఏన్నో ఏళ్ల కల నెరవేరిందని ఒకరికొకరు సంతోషాన్ని పంచుకున్నారు.

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు...

వైఎస్ జగన్ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు చేపట్టిన పాదయాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆయనను కలిసి తమ కష్టాలను విన్నవించారు. ఆయన ముఖ్యమంత్రి కాగానే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు హామీకి కట్టుబడి వారి జీవితాల్లో వెలుగు నింపారు. ఇచ్చిన హామీ మేరకు మినిమం టైమ్ స్కేల్ కింద నెలకు రూ. 32, 670 వేతనాన్ని ప్రకటించి వారికి నియామక ఉత్తర్వులను అందచేశారు.

160 మందికి...

వైఎస్ఆర్ జిల్లాలో 580 మంది అభ్యర్థులకుగాను 172 మంది 1998 డీఎస్సీ అభ్యర్థులకు బుధవారం కడపలోని డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో 172 మందికిగాను 160 మంది హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డితోపాటు ఏడీలు పరిశీలించారు. అనంతరం అందరికీ నియామక పత్రాలను అందజేశారు.

- డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ వీరందరినీ 20 నుంచి 30 మంది విద్యార్థులున్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయుడిగా పోస్టింగ్ ఇవ్వనున్నామన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

98 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం కడప డీఈఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి కడప నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత విద్యకు పెద్దపీట వేశారన్నారు. దీంతోపాటు ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. జగన్ పాదయాత్రలో 98 డీఎస్సీ అభ్యర్థులకు ఇచ్చిన హామీ మేరకు వారందరికీ ఉద్యోగాలను కల్పించి వారి జీవితాల్లో వెలుగు నింపారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర బాధ్యులు సజ్జల రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, వీఎస్‌పల్లి వైఎస్సార్‌టీఎఫ్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మేయర్ సురేష్‌బాబు, 98 డీఎస్సీ అభ్యర్థులు

నియామక పత్రాలను అందచేసిన మేయర్, డిప్యూటీ మేయర్లు...

98 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో డీఈఓ రాఘవరెడ్డితో కలిసి నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, ఎల్ఆర్‌పల్లె ఎంపీపీ సుదర్శన్‌రెడ్డిలు నియామక పత్రాలను అందచేశారు.



నా పేరు మధుసూదన్. నాది కడప టౌన్. నేను 98 డీఎస్సీ క్వాలిఫై అయినా అప్పట్లో ఏదో కారణాలతో ఉద్యోగం ఇవ్వలేదు. దీంతోపాటు నా వ్యక్తిగత కారణంతో ఉద్యోగం లేకపోవడంతో పెళ్లి చేసుకోలేదు. తరువాత చేసేదేమి లేక జీవనోపాధి కోసం ఓ ప్రైవేటు టీచర్ ట్రైయినింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశాను. తరువాత అక్కడ పిల్లల సంఖ్య తగ్గడంతో ఉద్యోగం మాని మళ్లీ ఓ ప్రైవేటు పాఠశాలలో చేరి ఉద్యోగం చేశాను. ఇప్పుడు డీఎస్సీలో ఉద్యోగం వచ్చింది. నాకు 8 ఏళ్ల సర్వీస్ ఉంది.



నాపేరు చంద్రమోహన్‌రెడ్డి. నేను 98 డీఎస్సీలో క్వాలిఫై అయ్యాను. అప్పట్లో ఉద్యోగం రాలేదు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నా. నాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించుకున్నాను. వారు నా కష్టాన్ని గుర్తించి ఇంజనీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాకు తీపి కబురు అందించారు. కౌన్సిలింగ్ నిర్వహించి నియామక పత్రం అందించారు. చాలా సంతోషంగా ఉంది. నాకు నాలుగేళ్ల సర్వీస్ ఉంది. అయినా సరే ప్రభుత్వ టీచర్ అనిపించుకుంటే చాలనే తృప్తితో ఉద్యోగం చేస్తా.




నాపేరు చాంద్‌బాష. మాది పొద్దుటూరు. నేను ఒక ప్రైవేటు ట్రాక్టర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నా. ప్రైవేటు ఉద్యోగమంటే ఒత్తిళ్లతో కూడుకున్నదైనప్పటికీ జీవనం కోసం కష్టపడాల్సి వచ్చేది. నాకు ఇద్దరు పిల్లలు. వారు బాగా చదివారు. నాకు ఇప్పుడు 98 డీఎస్సీలో ప్రభుత్వం ఉద్యోగం కల్పించింది. నాకు ఇంకా 10 ఏళ్ల సర్వీస్ ఉంది. నా ప్రభుత్వ ఉద్యోగ కల నెలవేరింది. ఈ పదేళ్లు పేద పిల్లలకు చదువు చెప్పి వారి జీవితాల్లో వెలుగు నింపుతా.



నా పేరు సుబ్బరామరాజు. నాది రాయచోటి. నేను కడపలోని ఓ కార్పోరేట్ స్కూల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాను. ఉద్యోగరీత్యా నేను కడపలో స్థిరపడ్డాను. నాకు ఇద్దరు పిల్లలు. వారిని చదివించాను. ఇందులో కుమార్తెకు వివాహం చేశాను. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. నాకు ఇప్పుడు 58 సంవత్సరాలు. నాకు నాలుగేళ్ల సర్వీస్ ఉంది. ప్రభుత్వ ఉద్యోగ కల నెలవేరింది.



నా పేరు శివకుమార్. వయసు 55 ఏళ్లు. భార్య, కుమార్తె ఉన్నారు. నాది కడప. 98 డీఎస్సీలో 0.5 మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. చాలా నిరాశకు గురయ్యాను. చేసేదేమీ లేక ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా జీవితం కొనసాగిస్తున్నాను. ఆశలన్నీ ఉడిగిపోయిన దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాకు ఊపిరి పోశారు. మా పాప టెన్త్ పరీక్షలు రాస్తోంది. జీవితంలో అత్యంత కీలకమైన దశలో మాకు ఉద్యోగాలివ్వడం ఎన్నటికీ మరిచిపోలేం. మాకు, మా పాప భవిష్యత్తుకు భరోసానిచ్చిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.



నా పేరు మోరగుడి సుధాకర్. వయసు 51 సంవత్సరాలు. ఎంఏ(మ్యాథ్స్), బీఈడీ చదివాను. 98 డీఎస్సీలో క్వాలిఫై అయినా ఉద్యోగం రాలేదు. మాది దిగువ మధ్యతరగతి కుటుంబం. ఆస్తిపాస్తులేమీ లేవు. పాతికేళ్ల నుంచి ప్రైవేటు స్కూళ్లలో టీచర్‌గా పనిచేస్తున్నాను. తల్లిదండ్రులు, చెల్లెళ్ల బాధ్యతను నెరవేర్చాను. నా భార్య గృహిణి. కుమార్తె పదో తరగతి పరీక్షలు రాస్తోంది. నాకొచ్చే ఆదాయంతో కనాకష్టంగా కుటుంబ జీవనం సాగేది. ఈ జీవితాకింతే అనుకున్న దశలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం ఎనలేని సంతోషాన్నిచ్చింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కావాలనే నా కల నెరవేరుస్తున్న సీఎం రుణం ఏం చేసినా తీర్చుకోలేను.

క్లుప్తంగా

గ్యాస్‌ లీక్‌ : తప్పిన ప్రమాదం

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఆజాద్‌ నగర్‌లోని ఓ ఇంటిలో గ్యాస్‌ లీకైంది. ఫైర్‌ స్టేషన్‌ ఎస్‌ఐ బసివిరెడ్డి కథనం మేరకు బాబ్‌జాన్‌ ఇంటిలో ఉదయం వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్‌ లీక్‌ అయి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గ్యాస్‌ పూర్తి స్థాయిలో లీక్‌ అయి ఉంటే పెను ప్రమాదం సంభవించేది. సకాలంలో ఫైర్‌ సిబ్బంది మంటలను అదుపు చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాక్టర్‌ ఢీ : వృద్ధుడి మృతి

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో బుధవారం ట్రాక్టర్‌ ఢీకొని వెంకటయ్య (80) అనే వృద్ధుడు మృతి చెందాడు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకటయ్య చాపాడు మండలం శ్రీరాములపేటలో ఉన్న తన కుమార్తె వద్దకు వెళ్లాడు. తిరిగి మైదుకూరుకు వస్తుండగా ప్రొద్దుటూరు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్‌ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అర్బన్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో హిజ్రాకు తీవ్ర గాయాలు

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలంలోని ఏ ఓబాయపల్లె సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపురం పట్టణానికి చెందిన సుగుణ అనే హిజ్రాకు తీవ్రంగా గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు ఏ ఓబాయపల్లె సమీపంలోని రోడ్డుపై ఉన్న హిజ్రాను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. దీంతో హిజ్రా రెండు పాదాలు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా వారు వచ్చి రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విష్ణు వర్ధన్‌ తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

రాజుపాళెం : స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లిన అచ్చుకట్ల సాజిద్‌ (13) మృతి చెందాడు. ఈ సంఘటన రాజుపాళెం మండలం టంగుటూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. అచ్చుకట్ల సాజిద్‌ గ్రామంలోని జిల్లా పరిషత్‌ పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. ఒంటిపూట బడి కావడంతో మధ్యాహ్నానికి ఇంటికి వచ్చిన విద్యార్థి స్నేహితులతో కలసి సరదాగా గ్రామ సమీపంలోని కుందూనదిలో ఈతకొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఈ విషయం అక్కడే ఉన్న రజకులకు తెలియడంతో సంఘటన స్థలానికి వెళ్లి సాజిద్‌ కోసం వెతికారు. కొద్ది సేపటికే సాజిద్‌ మృత దేహం పైకి తేలడంతో అక్కడి వారంతా కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజగోపాల్‌ తెలిపారు.



సాజిద్‌ (ఫైల్‌)

రాజస్థాన్‌ రాజుసం

పుట్టుకతో మూగ, చెవుడు.. చుట్టూ ఉన్నవారి హేళనలు.. జాలిచూపులు.. వీటన్నింటినీ దాటుకుని తనకంటూ ప్రత్యేకతను చాటిచెబుతూ ఓ వైపు క్రికెట్‌లో మరోవైపు వాలీబాల్‌ పోటీల్లో కడప నగరానికి చెందిన బిల్లా రాజు రాణిస్తున్నాడు. ఇండియన్‌ డెఫ్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐడీసీఏ 4వ టీ–20 డెఫ్‌ ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ టోర్నమెంట్‌లో పాల్గొనే రాజస్థాన్‌ రాయల్స్‌ జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో ఈయన ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు కోల్‌కతాలో నిర్వహించే టీ–20 టోర్నమెంట్‌లో పాల్గొననున్న నేపథ్యంలో రాజు క్రీడాప్రస్థానంపై ప్రత్యేక కథనం.

- డెఫ్‌ ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌కు కడప కుర్రాడు
- రాజస్థాన్‌ రాయల్స్‌ జట్టుకు బిల్లా రాజు ఎంపిక
- ఈనెల 23 నుంచి 27 వరకు కోల్‌కతాలో టోర్నమెంట్‌



బ్యాటింగ్‌ చేస్తున్న రాజు



మెడల్‌ అందుకుంటున్న రాజు

కడప స్పోర్ట్స్‌: కడప నగరం మరియాపురంనకు చెందిన కుమారి (గృహిణి), సుబ్బరాయుడు (మున్సిపల్‌ వాటర్‌ విభాగంలో పంప్‌ ఆపరేటర్‌) దంపతుల కుమారుడైన బిల్లా రాజుకు పుట్టుకతోనే మూగ, చెవుడు. దీంతో వారి తల్లిదండ్రులకు కొద్ది రోజుల పాటు ఇబ్బందులు తప్పలేదు. చుట్టూ ఉన్నవారి జాలిచూపులు, హేళనలు బాధించినా రాజును ఉన్నతంగా చూడాలన్న తల్లిదండ్రులు.. కడప నగరంలోని హెలెన్‌కెల్లెర్స్‌ బధిరుల పాఠశాలలో చేర్పించారు. రాజు సోదరుడు రవి క్రికెట్‌ ఆడుతున్న సమయంలో అతనితో పాటు వెళ్తూ మెల్లగా క్రికెట్‌ సాధన చేయడం ప్రారంభించాడు రాజు. తమ్మునిలోని క్రికెట్‌ నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాడు. దీంతో 9వ తరగతికి వచ్చేనాటికి క్రికెట్‌, వాలీబాల్‌ క్రీడలపై అభిమానం పెంచుకున్నాడు. దీంతో కడప నగరంలోని డీఎస్‌ఏ క్రికెట్‌ స్టేడియంలో క్రికెట్‌కు, వాలీబాల్‌ క్రీడల్లో శిక్షణకు వచ్చేవాడు. వాలీబాల్‌ పోటీల్లో పలుమార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు.

- క్రికెట్‌ కోచ్‌ ప్రసాద్‌, ఇలియాస్‌లు ప్రోత్సహించడంతో ప్రొఫెషనల్‌ క్రికెటర్‌గా మారాలని భావించాడు. పదోతరగతి అనంతరం ఇంటర్మీడియట్‌ హైదరాబాద్‌లోని స్వీకార్‌ ఉపకార్‌ కళాశాలలో చేరాడు. అక్కడే ఆయన క్రికెట్‌ జీవితం మలుపుతిరిగింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ అకాడమీలో శిక్షణ పొందుతూ డెఫ్‌ క్రికెట్‌లో పాల్గొనడం ప్రారంభించాడు. అనతి కాలంలోనే హైదరాబాద్‌ డెఫ్‌ జట్టుకు కెప్టెన్‌గా రాణించాడు. ఎడమచేతి వాటం గల రాజు బ్యాటింగ్‌, బౌలింగ్‌లో రాణిస్తూ ఆల్‌రౌండర్‌గా హైదరాబాద్‌ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. గత సీజన్‌లో హైదరాబాద్‌ డెఫ్‌ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన ఈయన తాజాగా రాజస్థాన్‌ రాయల్స్‌ జట్టుకు ఎంపికయ్యాడు.
- ఇండియన్‌ డెఫ్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు కోల్‌కతాలో నిర్వహించనున్న ఐడీసీఏ 4వ డెఫ్‌ ఇండియన్‌ ప్రీమియర్‌ లీగ్‌ పోటీల్లో పాల్గొనే రాజస్థాన్‌ రాయల్స్‌ జట్టుకు ఈయన ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఇప్పటి వరకు సౌత్‌జోన్‌ టీ–20, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తూ వస్తున్న ఈయన అంతర్జాతీయ పోటీల్లో భారత డెఫ్‌ జట్టుకు ప్రాతినిథ్యం వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.
- రాజు ఓవైపు క్రికెట్‌లో రాణిస్తూ కుటుంబ పోషణ కోసం కడప నగరంలోని ఓ ప్రైవేట్‌ ఫొటో స్టూడియోలో గ్రాఫిక్‌ డిజైనర్‌గా పనిచేస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. జిల్లాకు చెందిన రాజు రాజస్థాన్‌ రాయల్స్‌ జట్టుకు ఎంపికవడం పట్ల జిల్లా క్రికెట్‌ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

బాలిక అదృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని పెంజిఅనంతపురం గ్రామంలో బాలిక (16) మంగళవారం రాత్రి అదృశ్యమైంది. కొండాపురం ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు పెద్దముడియం మండలం పెద్దపసువుల గ్రామానికి చెందిన బాలిక పెంజిఅనంతపురంలోని అవ్వ ఇంటికి ఐదు రోజుల కిందట వచ్చింది. కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

వివాహిత ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మోడంపల్లెలో కొత్తపల్లె అనూష (29) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. టూ టౌన్‌ పోలీసుల కథనం మేరకు.. ఆచార్ల కాలనీకి చెందిన అనూషకు 12 ఏళ్ల క్రితం మోడంపల్లెలోని కిరణ్‌తో వివాహమైంది. అతను 17వ సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. వారికి సృజన్‌ అనే కుమారుడు, మన్విత అనే కుమార్తె ఉన్నారు. గత నెల 25న బద్వేల్‌ సమీపంలోని తొట్టిగారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అనూష తల్లి సుబ్బమ్మ చనిపోయింది. తల్లినే తలుచుకుంటూ ఆ రోజు నుంచి అనూష దిగాలుగా ఉండేది. అన్నం కూడా సరిగా తినేది కాదు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన అనూష బుధవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇబ్రహీం తెలిపారు.



అనూష మృతదేహం

జకాత్‌ పేదల హక్కు

కమలాపురం : అర్హత ఉన్న ప్రతి ముస్లిం జకాత్‌ను చెల్లించడం విధిగా పాటించాలి. జకాత్‌ పేదల హక్కు. ప్రతి ఏటా తమ వద్ద నిల్వ ఉన్న సొమ్ముపై జకాత్‌ తప్పనిసరిగా చెల్లించాలని స్థానిక దర్గా–ఏ గఫారియా పీఠాధిపతి (ముతవల్లి) సజ్జాద్‌–ఏ–నషీన్‌ మహమ్మద్‌ ఫైజుల్‌ గఫార్‌ షా ఖాద్రి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 52 తులాల వెండి లేదా 7.5 తులాల బంగారం లేదా వాటి విలువతో సమానంగా ఉన్న ధనం పై జకాత్‌ చెల్లించడం ప్రతి ముస్లిం విధిగా, అర్హతగా భావించాలన్నారు. కనీసం ఏడాది పాటు మన వద్ద నిల్వ ఉన్న ధనంపై జకాత్‌ చెల్లించాల్సి ఉంటుందన్నారు. తమ వద్ద ఉన్న సొమ్ములో 2.5 శాతం జకాత్‌ను తీసి పేదలకు పంచి పెట్టాలన్నారు. పేదలు కూడా ధన వంతులతో సమానంగా సంతోషంగా పండుగ జరుపుకోవడం కోసమే అల్లాహ్‌ జకాత్‌ అర్హులైన ముస్లిం సోదరులపై వాజిబ్‌ చేశారని ఆయన తెలిపారు. అలాగే వర్షాధారంతో పంటలు పండించే భూములున్న వారు పండిన పంటలో 1/10 వ వంతు, బోర్ల కింద సాగు చేసే వారు 1/20 వ వంతు జకాత్‌ చెల్లించాలన్నారు. అర్హులైన వారు సంవత్సరంలో ఒక సారి జకాత్‌ తప్పనిసరిగా చెల్లించాలని, అయితే రంజాన్‌ మాసంలో జకాత్‌ దానం చేస్తే 70 శాతం పుణ్యం అధికంగా లభిస్తుందన్నారు.



మహమ్మద్‌ ఫైజుల్‌ గఫార్‌ షా ఖాద్రి

జకాత్‌ పొందడానికి అర్హులు ఎవరు :

జకాత్‌ పొందడానికి పేదలు అర్హులు. జకాత్‌ సొమ్మును ముందుగా తమ బంధువుల్లో ఉన్న పేదలకు పంచాలి. తర్వాత ఇతర ముస్లింలకు పంచవచ్చు. ప్రయాణంలో ఉన్న వారు ఇబ్బందులు పడుతుంటే వారి అవసరాలకు తగిన మేరకు మాత్రమే ఈ సొమ్ము ఇవ్వవచ్చు. అలాగే తల్లిదండ్రులకు, సయ్యద్‌ కుటుంబాలకు, మదరసాలు, మస్జిద్‌లు, దర్గాలకు ఎటువంటి పరిస్థితిలో జకాత్‌ చెల్లించ కూడదు.

ఇదీ ప్రయోజనం : మనం స్నానం చేస్తే ఒంటిపై ఉన్న మురికి ఎలా తొలగిపోతుందో మన వద్ద ఉన్న సొమ్ముపై జకాత్‌ తీస్తే మన సొమ్ముపై ఉన్న మురికి కూడా తొలగి స్వచ్ఛంగా ఉంటుంది.

ఉపవాసం పాటించలేని వారు 'ఫిదియా' ఇవ్వాలి

అనారోగ్యం బారిన పడి, లేదా ఇతర కారణాలతో ఉపవాసం పాటించలేని స్థితిలో ఉన్న వారు ఒక వ్యక్తికి రెండు పూటల భోజనం తినడానికి ఎంత ఖర్చు అవుతుందో అంత ఖర్చును ఉపవాసం పాటించే వారికి ఇవ్వాలి. దీనిని ఫిదియా అంటారు.

ఇదుల్‌ ఫితర్‌ రోజు ఉపవాసం పాటించరాదు

రంజాన్‌ మాసం పూర్తి అయ్యాక షవ్వాల్‌ మాసం మొదటి రోజున ఇదుల్‌ ఫితర్‌ పండుగ జరుపుకుంటాం. అయితే ఆ రోజు ఉపవాసం పాటించదారు. అలా ఉపవాసం పాటిస్తే అది హరాం అవుతుంది.

పులివెందుల సబ్‌ రిజిస్ట్రార్‌ సహా ఆరుగురిపై చీటింగ్‌కేసు

మదనపల్లె : ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్స్‌ సృష్టించిన పులివెందుల సబ్‌రిజిస్ట్రార్‌తో సహా ఆరుగురు నిందితులపై న్యాయస్థానం ఆదేశాల మేరకు చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు టూటౌన్‌ సీఐ మురళీకృష్ణ తెలిపారు. వివరాలు... మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన కట్టా సులోచన, మార్వారి అబ్బయ్యగారివీధికి చెందిన వెంకటేశ్వర్లనాయుడుల మధ్య కొంతకాలంగా నీరుగట్టువారిపల్లె మార్కెట్‌ పక్కన ఉన్న సర్వే నెంబరు 36/1లో స్థలం విషయమై భూవివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సదరుస్థలాన్ని కట్టా సులోచన తన అనుచరులైన అనపగుట్టకు చెందిన గోవిందు, సత్యసాయి జిల్లా కదిరికి చెందిన గుడిగళ్ల మోహన్‌, మదనపల్లెకు చెందిన భాస్కర్‌, జి.మోహన్‌లతో కలిసి పులివెందుల సబ్‌రిజిస్ట్రార్‌ సహకారంతో ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్‌ సృష్టించారు. భూమికి సంబంధించి జనరల్‌ పవర్‌ ఆఫ్‌ పట్టా (జీపీఏ)ను తారుమారు చేసి రిజిస్ట్రేషన్‌ నంబరు 719/23తో 03/02/2023 తేదీన రిజిస్టర్‌ చేసి విక్రయించారని బాధితుడు వెంకటేశ్వర్లనాయుడు ఆరోపిస్తూ మదనపల్లె కోర్టులో తనకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం బాధ్యులపై కేసు నమోదు చేయాల్సిందిగా టూటౌన్‌ పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు పులివెందుల ఎస్‌ఆర్‌ఓతోపాటు నిందితులైన సులోచన, ఆమె అనుచరులు గోవిందు, గుడిగళ్ల మోహన్‌, భాస్కర్‌, జి.మోహన్‌లపై 109, 120బి, 167, 416, 420, 465, 468, రెడ్‌విత్‌156(3) సెక్షన్లతో చీటింగ్‌ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.40 కోట్లు ఇచ్చారని చెప్పడం విడ్డూరం

పులివెందుల రూరల్‌ : యువగళం పాదయాత్రలో టీడీపీ నాయకుడు నారా లోకేష్‌ దూదేకుల కార్పొరేషన్‌కు టీడీపీ హయాంలో రూ.40కోట్లు ఇచ్చారని చెప్పడం విడ్డూరంగా ఉందని దూదేకుల కార్పొరేషన్‌ చైర్‌ పర్సన్‌ ఫక్రుబీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్‌ దూదేకుల ఫెడరేషన్‌కు రూ.40కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని.. దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్‌ విసిరారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరు సభలో చెప్పిన విధగా బీసీ కార్పొరేషన్‌ ద్వారా ఏదైతే ఇస్తామని చెప్పారో అదేవిధంగా వైఎస్సార్‌ చేయూత ద్వారా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సుమారు రూ.200కోట్లు దూదేకుల సంఘాలకు ఈ పథకం ద్వారా వచ్చిందన్నారు. ఈసారి అధికారంలోకి వస్తే దూదేకులను చట్టసభలోకి తీసుకెళతామని మరోసారి మోసం చేయడానికి టీడీపీ నాయకులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. 14ఏళ్లుగా సంఘ ఓట్లతో అధికారంలోకి వచ్చిన మీ నాన్న చంద్రబాబు దూదేకులకు ఎటువంటి సహాయం చేయలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలల క్యాస్ట్‌ సర్టిఫికెట్లలో ముస్లిం దూదేకులు అని కాకుండా హిందు దూదేకులు అని రాయడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. దూదేకుల సమస్యలను సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామని.. త్వరలోనే మీటింగ్‌ ఏర్పాటు చేసి పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్‌ ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌ రఫి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అనకాపల్లి ఎంపీ డాక్టర్‌ వెంకట సత్యవతి

వేంపల్లె : చేనేతల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని అనకాపల్లి ఎంపీ డాక్టర్‌ వెంకట సత్యవతి పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్‌ జిల్లాలోని వేంపల్లె మండలం ఇడుపులపాయ వైఎస్సార్‌ ఘాట్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె వైఎస్సార్‌ సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేనేతలను విస్మరించడం జరిగిందన్నారు. దివంగత వైఎస్సార్‌ హయంలో చేనేతలకు అండగా నిలిచారన్నారు. అలాగే సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి చేనేతల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి ఏడాదికి రూ.24వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ భర్త డాక్టర్‌ విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, సుదర్శన్‌, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌ సమాధి వద్ద పూలమాలలు ఉంచుతున్న అనకాపల్లి ఎంపీ డాక్టర్‌ వెంకట సత్యవతి

తల్లి, శిశువు డాడీ హోంకు తరలింపు

ప్రొద్దుటూరు క్రైం : నా అన్నవారు ఎవరూ లేకపోవడంతో బాలింతతో పాటు శిశువును ఐసీడీఎస్‌ అధికారులు డాడీ హోంకు తరలించారు. షాహిదా బేగం మూడు రోజుల క్రితం జిల్లా ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు రక్తసంబంధీకులు ఎవ్వరూ లేరు. అయితే ఆస్పత్రిలోని పసికందును కొందరు విక్రయించేందుకు ప్రయత్నం చేస్తున్నారని సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు, ఐసీడీఎస్‌ అధికారులు బుధవారం జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ సంఘటనపై ఆరా తీశారు. షాహిదా మానసిక పరిస్థితి సరిగా లేదని అధికారుల విచారణలో తేలింది. ఆమెకు ఇది వరకే 11,6 ఏళ్ల ఇద్దరు కుమారులు ఉన్నారు. వాళ్లిద్దరూ మైలవరంలోని డాడీ హోంలో ఉంటున్నారు. ఆమె కూడా అక్కడే ఉండేది. అయితే కొన్ని నెలల కిందట హోం వాళ్లకు చెప్పకుండా ప్రొద్దుటూరుకు వచ్చింది. ఇక్కడి పెన్నానగరలోని ఆమె బంధువుల ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలోనే గర్భిణీ అయిన ఆమె మూడు రోజుల క్రితం జిల్లా ఆస్పత్రిలో మగబిడ్డను ప్రసవించింది. బిడ్డను విక్రయించే ప్రయత్నం చేస్తున్నారన్న సమాచారం తెలియడంతో అప్రమత్తమయ్యారు. రూరల్‌ సీడీపీఓ అరుణకుమారి షాహిదాను విచారించారు. బంధువులు ఎవరూ లేకపోవడంతో శిశువుతో పాటు తల్లిని కడపలోని శిశుసంరక్షణ హోంకు తరలించాలని అధికారులు ప్రయత్నించగా అందుకు షాహిదా అంగీకరించలేదు. ఆమె మానసిక ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఒంటరిగా వదలి వెళ్లడం మంచిది కాదని అధికారులు భావించారు. తన ఇద్దరు కుమారులు డాడీ హోంలో ఉన్నందున ఈమెను కూడా అక్కడికే పంపించడం మంచిదనే నిర్ణయానికి వచ్చారు. అందుకు షాహిదా కూడా అంగీకరించడంతో మానవతా దృక్పథంతో తల్లీబిడ్డలను డాడీ హోం ప్రతినిధులకు అప్పగించారు.



తల్లీ, బిడ్డలను డాడీ హోం ప్రతినిధులకు అప్పగిస్తున్న ఐసీడీఎస్‌ అధికారులు

28 ఎర్రచందన దుంగలు స్వాధీనం

రాయచోటిటౌన్‌ : అన్నమయ్య జిల్లా వీరబల్లె మండలం వీరబల్లె ఫారెస్ట్‌ బీట్‌ పరిధిలో గత రాత్రి 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఏఆర్‌కు చెందిన రిజర్వ్‌ ఇన్‌స్పెక్టర్‌ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టాస్క్‌ఫోర్స్‌ ఎస్పీ కె. చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్‌ఎస్‌ఐ సురేష్‌బాబు బృందం మంగళవారం రాత్రి సానిపాయి బేస్‌ క్యాంపు నుంచి గడికోట చేరుకున్నారు. వీరబల్లె బీట్‌లో కూంబింగ్‌ నిర్వహించారు. ఝరికోన ప్రాంతంలో కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని హెచ్చరించి చుట్టుముట్టేలోపే దుంగలు పడేసి పారిపోయారు. ఒక నిందితుడు చిక్కాడు. అతడిని విచారించగా మొత్తం 14 మంది వచ్చినట్లు చెప్పాడు. అరెస్టయిన నిందితుడు తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లాకు చెందిన శంకర్‌ వెంకటేశన్‌ (36)గా గుర్తించారు. నిందితుడు తిరుపత్తూరు నుంచి చిత్తూరు మీదుగా రాయచోటికి చేరుకున్నాడు. అక్కడి నుంచి 15 రోజుల క్రితం అడవిలోకి వెళ్లాడు. నిందితుడిపై తిరుపతి టాస్క్‌ఫోర్స్‌ పోలీస్‌ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు.

పతనమవుతున్న పార్లమెంట్‌ ఔన్నత్యం

ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య

కడప కార్పొరేషన్‌: పార్లమెంటు సమావేశాలు ఓ తంతుగా, మొక్కుబడిగా సాగడం రివాజుగా మారి చాలా కాలమైందని శాసన మండలి సభ్యులు సి. రామచంద్రయ్య అన్నారు. బుధవారం కడపలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల అర్ధంతరంగా ముగిసిన బడ్జెట్‌ సమావేశాలు ఆ సంప్రదాయాన్ని కొనసాగించాయన్నారు. పార్లమెంట్‌ అధికారిక లెక్కల ప్రకారం 134 గంటల పాటు జరగాల్సిన లోక్‌సభ సమావేశాలు కేవలం 45 గంటలపాటు, 130 గంటలపాటు నిర్వహించాల్సిన రాజ్యసభ సమావేశాలు అతి తక్కువగా 31 గంటలపాటు జరిగాయన్నారు. లోక్‌సభ ఉత్పాదకత పని 34 శాతం కాగా, రాజ్యసభ ఉత్పాదకత 24.4 శాతం మాత్రమేనన్నారు. 6 బిల్లులు ఉభయ సభల ఆమోదం పొందాయన్నారు పార్లమెంటు బడ్జెట్‌ సమావేశాల్లో ఇంత తక్కువ సంఖ్యలో బిల్లులు ఉభయ సభల ఆమోదం పొందడం చాలా అరుదన్నారు. పార్లమెంటరీ వ్యవస్థ ఎప్పుడైతే ఓ తంతుగా, తమాషాగా మారిపోయిందో అప్పటి నుంచే సామాన్య ప్రజల్లో ప్రజా ప్రతినిధుల పట్ల గౌరవం సన్నగిల్లిపోయిందన్నారు. పార్లమెంటు ప్రాముఖ్యతను తగ్గించకుండా తగిన కార్యాచరణను రూపొందించడంలో అన్ని రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉండాలన్నారు. లేదంటే పార్లమెంటు అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.

● ప్రమాణ స్వీకారం

బుధవారం వెలగపూడిలోని శాసనసభా ప్రాంగణంలో కడప-కర్నూలు- అనంతపురం నియోజకవర్గాల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎంవీ రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.



రైతు ఆత్మహత్యపై విచారణ



ఉప్పలూరులో విచారణ చేపడుతున్న ఆర్డీవో బృందం

ముద్దనూరు : రైతు ఆత్మహత్యపై బుధవారం ఆర్డీవో శ్రీనివాసులు బృందం విచారణ చేపట్టింది.డివిజన్‌ స్థాయి కమిటీ సమాచారం మేరకు మండలంలోని ఉప్పలూరు గ్రామంలో 2022 డిసెంబరు 7వతేదీన రైతు ఖాతా రామిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ నేపథ్యంలో ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ నరేష్‌బాబు,మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి, తహసీల్దారు వెంకటేశ్వర్లు రైతు భార్య లక్ష్మీ సుబ్బమ్మ,కుమారుడు శివమోహన్‌రెడ్డిలతో మాట్లాడారు.రామిరెడ్డి భూమి కౌలుకు తీసుకుని కూరగాయలు సాగుచేసారని,అప్పులు ఎక్కువ కాడంతో వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబీకులు అధికారులకు తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు.

గురుకుల పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

పులివెందుల టౌన్‌ : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో శ్రీస్వామి నారాయణ ఇంటర్నేషనల్‌ (గురుకుల) స్కూలు ఏర్పాటు కోసం స్కూలు ఎండీ మనోహర్‌, యాజమాన్య బృందం పులివెందులకు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం స్థల పరిశీలనకు వచ్చిన బృందానికి పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పులివెందులలోని కదిరి రోడ్డు, ఏపీ కార్ల్‌ సమీప ప్రాంతం, జగనన్న హౌసింగ్‌ కాలనీ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను చూపించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్‌ మాధవ కృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గండికోటను సందర్శించిన ఒబెరాయ్‌ కన్సల్టెన్సీ బృందం

జమ్మలమడుగు: గండికోటలో ఒబెరాయ్‌ కన్సల్టెన్సీ అధికారులు పర్యటించారు. బుధవారం ఆర్డీఓ జి.శ్రీనివాసులు వారికి భూములను చూపించారు. ప్రభుత్వం పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఒబెరాయ్‌ విల్లాల నిర్మాణానికి ముందుకు రావడంతో 50 ఎకరాల భూమిని 99 సంవత్సరాల పాటు లీజుకు కేటాయించింది. గతేడాది నవంబర్‌లో ఒబెరాయ్‌ హోటల్స్‌, రిసార్ట్సు సీఈఓ అర్జున్‌సింగ్‌ ఒబెరాయ్‌, రాజమాన్‌ శంకర్‌, వినోద్‌ గోస్వామి, గండికోట, పెన్నానదిలోయ ప్రాంతాల్లో పర్యటించారు. మొత్తం 250 కోట్ల రూపాయలతో 120 విల్లాలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులు మూడు ,నాలుగు ప్రాంతాల్లో భూమిని ఒబెరాయ్‌ హోటల్స్‌ యజమాన్యానికి చూపించారు. బుధవారం ఒబెరాయ్‌ కన్సల్టెన్సీ అయిన గౌతమ్‌ టైగ్రీ గండికోటలోయ ప్రాంతాల వద్ద భూముల వివరాలను సేకరించారు.



గండికోట పరిసరాలను పరిశీలిస్తున్న ఒబెరాయ్‌ కన్సల్టెన్సీ అధికారులు, ఆర్డీఓ